అంతా కార్యకారణ సంబంధమే..!

సిద్ధార్థుడు శాక్యరాజవంశంలో క్రీ.పూ.563లో కపిలవస్తు నగరం, లుంబినీ వనం (నేపాల్)లో జన్మించాడు. తల్లి మాయాదేవి, తండ్రి శుద్ధోధనుడు. భార్య యశోధర, కుమారుడు రాహులుడు; పెంచిన తల్లి గౌతమీ ప్రజాపతి. సిద్ధార్థుడు రాజకుమారు లందరిలాగే క్షత్రియ విద్యలు నేర్చుకున్నాడు. యుక్త వయస్సులో పెళ్లి చేసుకొని, కొంతకాలం సంసార జీవితం గడిపాడు. కాని రాజభోగం, సంపద, సంసార సౌఖ్యం ఆయనకు సంతృప్తినివ్వలేదు. ప్రపంచంలో కనిపించే దుఃఖం అతని మనసును వికలం చేసింది. భార్యాబిడ్డల్ని, రాజ్యాన్ని త్యజించి సిద్ధార్థుడు.. సన్యాసిగా మారాడు. దానే్న 'మహాభినిష్క్రమణం' అంటారు!!

సిద్ధార్థుడు దేశదిమ్మరిగా తిరుగుతూ.. సాంఖ్య-దర్శనాలు అభ్యసిం చాడు. మరికొన్నాళ్లు యోగాభ్యాసం చేశాడు. 'అలారకలమ' అనే బ్రాహ్మణుడు యోగసాధనలో కొన్ని మెళకు వలు నేర్పాడు. చివరికి సిద్దా'గయ'లో ఒకచోట రావిచెట్టు కిందకూర్చుని, ధ్యానంలో నిమగ్ను డయ్యాడు. 49వ రోజున సిద్ధార్థునికి జ్ఞానోదయమైంది. అప్పటికి ఆయన వయసు 35 సంవత్సరాలు. ప్రపంచంలో దుఃఖానికి కారణం తెలిసింది. వెంటనే 'సారనాథ్'లో మొట్టమొదటిసారిగా తన 'ధర్మచక్ర ప్రవర్త'నాన్ని అయిదుగురు శిష్యులకు బోధించాడు. అజితుడు, మౌద్గ ల్యుడు, శారిపుత్ర, మహాకాశ్యపుడు, ఆనందుడు గౌతమ బుద్ధుని అనుచరులయ్యారు. శ్రావస్తీ నగరానికి చెందిన మహా ధనవంతుడైన అనాథ పిండకుడనే వైశ్యుడు.. బౌద్ధ ధర్మాన్ని స్వీకరించి, బౌద్ధమత వ్యాప్తికి విశేష ధనాన్ని ఖర్చుచేసినట్లు ఫాహియాన్ రచనల ద్వారా తెలుస్తోంది.

బుద్ధుడు కొంతకాలం రాజగృహ, మగధ, కపిలవస్తు నగరాలు సందర్శించాడు. తన కుటుంబ సభ్యులందరినీ బౌద్ధమతంలోకి చేర్చాడు. దాదాపు 45 ఏళ్ల పాటు ధర్మచక్ర ప్రవర్తనాన్ని బోధిం చాడు. 80 ఏళ్ల వయసులో క్రీ.పూ.483లో ఉత్తరప్రదేశ్‌లోని 'కుసినార'లో కాల ధర్మం చెందాడు. బుద్ధుడు తన ఆఖరి ధర్మ ప్రబోధాన్ని సుభద్ర అనే సన్యాసినికి, తన ప్రియశిష్యుడు ఆనందునికి బోధించాడు. ప్రపంచం దుఃఖ మయం.. పుట్టిన ప్రతి ప్రాణి వస్తుమయం.. అంతా నాశనం కాకతప్పదు.. అందువల్ల ధర్మపథాన్ని వీడకుండా.. తమ తమ ధర్మా లను నిర్వర్తిస్తూ.. జ్ఞానమార్గాన్ని పొందాలని ప్రబోధిం చాడు.బుద్ధుని జీవిత కాలంలో ఆయనతో సన్నిహితంగా మెలిగినవారు... సారిపుత్రు డు, మొగ్గల్లన్న, కాశ్యపుడు, ఆనందుడు, యోగవిద్యలో మెలకువలు



నేర్పిన అలారకలమ, ఉద్దకుడు, రథసారథి చెన్నుడు, మంగలి ఉపాలీ, బుద్ధగయలో పరమాన్నం అందించిన సుజాత. వీరంతా బౌద్ధాన్ని స్వీకరించి నవారే. బుద్ధుని కాలంలో బౌద్ధధర్మాన్ని పాటించిన మహా రాజులు... ప్రసేనజిత్తుడు, బింబిసారుడు, అజాతశత్రువు.

బుద్ధుని జీవితానికి సంబంధించిన అయిదు సంఘటనలు.

1) జననం - పద్మం, ఎద్దు గుర్తులు
2) మహాభినిష్క్రమణం - గుర్రం
3) జ్ఞానోదయం - బోధివృక్షం
4) ధర్మచక్ర ప్రవర్తనం - ధర్మచక్రం
5) నిర్యాణం - స్తూపం

బుద్ధుని నాలుగు సూత్రాలు (లేదా) సత్యాలు

1) ప్రపంచం అంతా దుఃఖమయం
2) కోర్కెల వల్లే చింతలు తలెత్తుతున్నాయి
3) కోర్కెలను జయిస్తే చింతలను తొలగించవచ్చు
4) కోర్కెలను జయించడానికి అష్టాంగ మార్గం ఒక్కటే దారి

అష్టాంగ మార్గం

1) సరైన దృష్టి 2) సరైన లక్ష్యం 3) సద్భాషణ 4) సత్కార్యం 5) సరైన జీవనం 6) సరైన కృషి 7) సరైన చైతన్యం 8) సరైన ధ్యానం

బౌద్ధంలో మూడు 'ఆభరణాలు'

1) బుద్ధం 2) ధమ్మం (సిద్ధాంతం) 3) సంఘం (బౌద్ధసంఘం)

బౌద్ధంలో శాఖలు:

హీనయాన బౌద్ధం... ఇందులో బుద్ధుని ధర్మ బోధలను మాత్రమే ప్రముఖంగా తీసుకుని.. వ్యక్తిగత క్రమశిక్షణ, ధ్యానం ద్వారా మోక్షం పొందవచ్చని ఈ శాఖకు చెందిన భావించారు. వీరు విగ్రహారాధనను విశ్వసించలేదు. కొన్ని గుర్తులు, సంకే తాల ద్వారాబుద్ధుడుని ఆరాధిం చారు. అవి బుద్ధ పాదాలు, సింహాసనం, మూడు రత్నాలు మొదలై నవి. **మహాయానం...** బుద్ధులు మానవాతీతులని..వీరు విశ్వసిస్తారు.

బుద్ధవిగ్రహాలను పూజించారు. వీరిలో మైత్రేయుడు, బుద్ధుడు, మంజుశ్రీ, అవలోకితేశ్వర, వజ్రపా.. మొదలైన బోధిసత్వులను పూజించేవారు. మహాయానం మధ్యఆసియా, చైనా, జపాన్ దేశాలకు వ్యాపించింది. మహాయానంలో రెండు ప్రధానతాత్విక చింతనలున్నాయి. ఒకటి మాధ్యమిక. రెండోది యోగాచార చింతన. దీనినే 'విజ్ఞానవాదిన్' అంటారు.ఆంధ్రదేశంలో క్రీ.శ. మొదటి శతాబ్దంలో ఆచార్య నాగార్జునుడు 'మాధ్యమిక తాత్విక చింతన' వాదాన్ని ప్రతిపాదించాడు. ఆయన రాసిన 'మాధ్యమిక కారిక' ఈ చింతనకు మూలాధారం. నాగార్జుని ప్రవచనాలను 'శూన్యవాదం' అని కూడా వ్యవహరిస్తారు. మైత్రేయనాథుడు యోగాచారచింతన తాత్విక సిద్ధాంతాన్ని స్థాపించాడు.

వజ్రయానం... మంత్ర, తంత్ర శక్తుల ద్వారా మోక్షాన్ని పొందవచ్చునని ఈ మత శాఖవారు విశ్వసించారు. వజ్రయానం పాలవంశ రాజులు కాలంలో తూర్పు భారతదేశంలో బాగా ప్రచారం పొందింది. వజ్రయానం టిబెట్‌లో ఎక్కువగా వ్యాప్తి చెందింది. బుద్ధుడు ప్రవచించిన సూత్రం కార్యకారణవాదం. ప్రపంచంలో ప్రతి సంఘటన ఏదో కారణం వల్ల జరుగుతుంది. కారణం లేకుండా ఏదీ జరగదు. కారణం కార్యాన్ని సృష్టిస్తుంది. ఈ కార్యం తిరిగి కారణమై మరొక కార్యాన్ని సృష్టిస్తుంది. కార్యకారణ సంబంధం మీద ఆధారపడి ఈ ప్రపంచం నడుస్తుంది. ఈ ప్రపంచంలో కోరికే దుఃఖానికి కారణం; పునర్జన్మకి కారణం మనిషి కర్మఫలం అనుభవించాలి. మంచి పనుల ద్వారా, అంటే.. ఎనిమిది సూత్రాల్ని పాటించడం ద్వారా జ్ఞానాన్ని పొందాలి. మరణం అంటే.. పుట్టుక లేని అనంతం. అమితమైన మానసిక ప్రశాంత స్థితి. ఈ ధర్మప్రబోధం ప్రజలకు సులభంగా అర్థమైంది. బుద్ధుడు వర్ణ విభజనను, వైదికమ తంలోని ఆస్తికతను నిరాకరించాడు. యజ్ఞ యాగాలలో జరిగే జంతుబలుల్ని నిరసించాడు. ఆత్మసంస్కారానికి ఆచరణసాధ్యమైన అష్టాంగమార్గాన్ని బోధించాడు. బౌద్ధమతం భారతీయ జీవనాన్ని ప్రభావితం చేసింది. బౌద్ధ విహారాలు విద్యా కేంద్రాలుగా రూపొందాయి. బౌద్ధులు భారతీయ సంస్కృతిని మధ్య ఆసియా, టిబెట్, చైనా, ఆగ్నేయాసియా దేశాలకు వ్యాపింప చేశారు. అశోక చక్రవర్తి కాలంలో బౌద్ధమతం పతాక స్థాయికి చేరింది.

బౌద్ధమత పరిషత్ సభలు :

బౌద్ధ భిక్షువులు మత నిబంధనలను పాటించేందుకు వీలుగా బుద్ధుడి జీవితకాలంలోనే సంఘాలుగా ఏర్పడ్డాయి. బౌద్ధమత సిద్ధాంతాలు, సంకరం కాకుండా కాపాడడానికి పరిషత్ సభలు నిర్వహించేవారు. ఈ సభలు మహా వైభవంగా జరిగేవి. అనేక ప్రాంతాల నుంచి ఈ సభలకు పండితులను ఆహ్వానించేవారు. బౌద్ధయుగ కాలంలో ఇటువంటి సభలు నాలుగు జరిగినట్లు తెలుస్తోంది.

ప్రథమ మహాసభ...

గౌతమబుద్ధుడు మరణించిన వెంటనే క్రీ.పూ 483లో మగధ రాజధాని 'రాజగృహ 'లో ప్రథమ మహాసభ జరిగింది. ఈ సభకు 'మహాకాశ్యపుడు' అధ్యక్షుడుగా వ్యవహరించాడు. ఈ సభ ముఖ్య ఉద్దేశం... బుద్ధుని ప్రవచనాలు సంకరం కాకుండా చూడడం. ఈ సభలో బుద్ధుని ధర్మ బోధనలన్నీ పఠనం చేశారు. ఈ ధర్మప్రబోధాలు కాలగర్భంలో కలిసిపోకుండాకాపాడాలని.. బుద్ధునిసంభాషణల్ని'త్రిపీఠికలుగా' సంగ్రహించారు. అవి.. 'సుత్తపిటక'(బుద్ధుని ప్రవచనాలు), 'వినయ పిటక' (భిక్షువుల నిబంధనలు). 'పిటక' అంటే 'బుట్ట'అని అర్థం. ఈ 'పిటకాలను తాటి ఆకులపై రాసి బుట్టలలో భద్రపరచడంట వల్ల 'పిటకాలని' పేరు వచ్చింది.

ద్వితీయ మహాసభ ...

బుద్ధుడు మరణించిన వందేళ్లకు క్రీ.పూ. 383లో వైశాలీ పట్టణంలో ద్వితీయ మహాసభ నిర్వహించారు. ఈ సభ 'సబకామి' అధ్యక్షతన జరిగింది. అప్పట్లో బౌద్ధుల మధ్య తలెత్తిన అభిప్రాయబేధాలు నివారించడం ఈ సభ ముఖ్య ఉద్దేశం. అయితే ఈ అభిప్రాయబేధాలు సమసిపోలేదు. వారు ఉత్తర బౌద్ధులుగా (స్థవిరవాదినులు లేదా తేర వాదినులు), దక్షిణ బౌద్ధులు(మహాసాంఘికులు)గా విడిపోయారు.

మూడో సభ :

కీ.పూ. 250లో అశోక చక్రవర్తి ఆధ్వర్యంలో.. 'మొగ్గలిపుత్త తిష్య' (ఉపగుప్త) అధ్యక్షతన రాజధాని పాటలీపుత్రంలో మూడో సభ జరిగింది. స్థవిరవాద బౌద్ధులు నిజమైన బుద్ధుని అనుయాయులమంటూ.. ఇతర బౌద్ధ భిక్షువులను తరిమి వేశారు. గతంలోని రెండు పిటకాలకు మూడవ పిటకమైన అభిధమ్మ పిటకాన్ని చేర్చారు. సుత్తపిటకం, వినయ పిటకాలకు తాత్విక విశ్లేషణే 'అభిధమ్మ పిటకం'. ఈ సమయంలోనే అశోకుడు తన కుమారుడు మహేంద్రుడిని త్రిపిటకల వ్యాప్తి కోసం సింహళ ద్వీపానికి పంపించాడు. అక్కడే ఈ మూడు 'పిటకాలు' క్రీ.పూ 88లో గ్రంథస్తమయ్యాయి. బౌద్ధమత చరిత్రలో ఇదొక గొప్ప ఆధ్యాయనం.

నాలుగో మహాసభ..

నాలుగో బౌద్ధ పరిషత్తు మహాసభ క్రీ.శ మొదటి శతాబ్దంలో కనిష్కుని కాలంలో కాశ్మీర్‌లో జరిగింది. ఈ సభను అశ్వఘోషుని సహాయంతో 'వసుమిత్రుడు' నిర్వహించాడు. అశ్వఘోషుడు' బుద్ధ చరిత్రను రాశాడు. ఈ సభ ముఖ్య ఉద్దేశం బౌద్ధంలోని 18 శాఖలలోని అభిప్రాయబేధాలను తొలగించడం. మూడు త్రిపిటకాలకు మూడు భాష్యాలు రాశారు. ఈ సభ ఫలితాలు...అన్ని బౌద్ధ శాఖలను కలిపి రెండు శాఖలుగా.. స్థవిరవాదినులు, మహా సాంఘికులుగా విభజించారు. సర్వాస్టివాదిని సిద్ధాంత గ్రంథాన్ని మహావిభాస రాగి రేకులపై చిత్రించి, స్తూపాలలో నిక్షిప్తం చేశారు. ఈ సభలో పాళీ భాషకు బదులుగా సంస్కృతంలో తీర్మానాలు చేశారు. క్రీ.శ 8వ శతాబ్దంలో వజ్రయానం బౌద్ధం వచ్చింది!!